# కంచెలే పేదల ఆశలు

ఆర్. వసుంధర

మాలకొండయ్యకి గౌరికీ పెళ్ళయింది. "కొండయ్య అదృష్ట వంతుడు. మంచి పెళ్లాం దొరికింది" అన్నారు అందరూ.

గౌరి నలుపైనా చూపులకు చక్కగా వుంటుంది. పనిలో చురుకైనది. మొదటి నుంచీ కష్టపడటం అలవాటైనదీను. పెళ్లాని కుండవలసిన లక్షణాలన్నీ వున్నై.... కాని వాళ్లు చిన్న మెత్తు బంగారంకానీ తులం వెండి కానీ పెట్టలేదు. మరీ బక్క సంసారం. సొంతానికి పూరిగుడిసె కూడా లేదు. పెళ్లి చెయ్యటమే గగనమై పోయింది. వాళ్ళకు తండ్రి కూలి, ఆడవాళ్ళ పాచిపనులతోగడిచే సంసారం.

తమ్ముడు కొండయ్య వెనుక ఆధరువు లేనివాడు కనుకనూ, మరెవరూ పిల్లనిస్తా మని రాలేదు గనుకనూ యీ సంబంధానికి ఒప్పుకున్నది రాజమ్మ. అంతేగాని నిజానికి యింత లేమిలో వుండే సంబంధం ఆమెకు నచ్చలేదు.

తండ్రి సుబ్బయ్య పోయాక పుట్టి నింటి వారికి జరుగుబాటు లేనందున తమ్ముణ్ణి తన వెంట తీసుకొచ్చింది పిల్లలు లేని రాజమ్మ. అప్పటికి కొండయ్య పదేళ్ళవాడు. ఆ పదేళ్ళ తాలూకు రామ తీర్థపు జ్ఞాపకాలు కొండయ్య మనసులో వున్నవన్నీ యెండలో ఇసుకలో ఆడుకోవడమే. అమ్మ పెట్టింది కడుపునిండా తినడం, ఆడుకోవడం. బిళ్లంగోడు, గోళీ కాయలు, విల్లంబులు, ఇసుకలో యిళ్ళు.... ఎన్నో ఆటలు. అన్నీ ఆటలే. పెళ్లికి రామ తీర్థంనుండి కొండయ్యతల్లి ఎంకమ్మా, అన్న శేషయ్యా, చిన్నక్క లక్ష్మమ్మా అందరూ వొచ్చారు. పెళ్లికాగానే వెళ్లిపోయారు. పెళ్లి ఖర్చు రాజమ్మ పెట్టుకున్నది.

పెళ్ళైతే చేసుకున్నాడుగాని పెళ్లాన్ని ఎట్లా పోషించాలన్న ఆలోచన కొండయ్యకు లేదు. అక్క చెప్పింది కాబట్టి చేసుకున్నాడు. తండ్రి సుబ్బయ్యలాగా కొండయ్యకి ఏ విషయం గురించీ ఆలోచించటం అలవాటు లేదు. ఎప్పటికేది చెయ్యవలసి వొస్తే అది చెయ్యటమే. ఆ చిన్న ఊళ్లో వ్యవసాయపు కూలిపనులు యెప్పుడూ వుండవు. దొరికినప్పుడు కూలికి వెళ్లి సంపాదించింది అక్క చేతికిస్తాడు. కూలి దొరకనప్పుడు పొయ్యిలోకి పుల్లలు ఏరి తెచ్చీ, మగ్గానికి కండెలు చుట్టి యిచ్చీ, కాలవలో చేపలు పట్టీ, ఇంకా రాజమ్మ చెప్పే చిల్లరపనులు చూసుకుంటూ కులాసాగా తిరుగుతుంటాడు. కళ్లు తేనె రంగులో వున్నా మాటకు ముందు వుత్సాహంలో నలుపుకు తిరిగి పోతాయి. ఎప్పుడూ నవ్వటానికి సిద్ధంగా వుండే మొఖం కొండయ్యది. ఏ విషయాన్నైనా తేలిగ్గా తీసుకుని సరదాగా చేస్తాడు.

మొదట్లో పెళ్లి చేసుకుందామని కొండయ్య తానుగా అనుకోలేదు. కాని చేసుకున్నాక గౌరిమీద చాల యిష్టం కలిగింది. సన్నటి అర్భకపు మనిషి గౌరి. చందమామలాంటి గుండ్రని మొఖం. పెద్దకళ్లు. అప్పుడప్పుడు నవ్వినప్పుడు తప్పించి పట్టుదలతో బిగుసుకు పోయినట్లుండే సన్నటిపెదిమలు కొండయ్యకు గౌరిని చూస్తే కొద్దిగా భయమూ, చాలా యిష్టమూను.

మంచిరోజు చూసుకుని పెళ్లాన్ని తీసుకు రావడానికి వెళ్లాడు కొండయ్య 'ఆవిడ నీ కన్నతల్లా? పెంపుడు తీసుకుందా? ఏం సంబంధం? మనం వేరే యింట్లో వుందాం. ఇద్దరం కూలోనాలో చేసుకుని యిల్లూ వాకిలీ ఏర్పాటు చేసుకుందాం' అన్నది గౌరి. పెళ్లిలో రాజమ్మ ప్రవర్తన ఆడ పెళ్ళి వారందరికీ కష్టం కలిగించింది. అంతే కాకుండా కొత్త చీర కట్టుకుని నున్నగా తలదువ్వి పూలు ముడుచుకున్నా. రోతపుట్టేట్లుగా చీర మీది నుంచీ కాళ్లు బరబరా గోక్కుంటూ, చేతి వేళ్ల సందుల్లోని పొక్కుల్ని చిదుపుకుంటూ కనిపించిన రాజమ్మంటే గౌరికి అసహ్యం పుట్టింది.

గౌరి మాటలు వినగానే కొండయ్యకు భయమూ ఆశ్చర్యమూ కలిగాయి. తన చిన్నతనం నుండి అంతా రాజమ్మ బాధ్యత మీదనే జరిగి పోతుండెనే, ఇప్పుడా బాధ్యతంతా నెత్తిమీద వేసుకుని.... కొండయ్యకు భయం వేసింది. గౌరి పద్దెనిమిదేళ్ల లేత పిల్లలాగా, తన పెళ్లాంలాగా కాకుండా అన్నిటినీ అల్లకల్లోలం చెయ్యబోతున్న ఉరుములాగా పిడుగులాగా అనిపించింది. జరిగేది జరిగి పోనివ్వకుండా యీ ఆలోచనేమిటి! 'నిదానం మీద చూద్దాంలే' అని చెప్పి తీసుకొచ్చాడు.

ఊడ్చివున్నా శుభ్రం లేనట్లు చీకాకు కలిగిస్తున్నది ఇల్లు. ఇంట్లో మూలమూలల్లో పడివున్న గుడ్డలన్నీ దులిపి దణ్ణెంమీద వేసింది గౌరి. పక్క చుట్టల్ని వరుసగా పేర్చింది. పొయ్యికి ఈ ప్రక్కా ఆప్రక్కా చెదురు మదురుగా పడివున్న పిడకల్నీ కట్టెల్నీ ఇంటిబయట గోడవారగా పేర్చింది. చక్కగా ఇల్లంతా ఊడ్చి ఒక గంపనిండా చెత్తా చెదారం యెత్తిపోసింది. ఆవుపేడ తెచ్చి ఇల్లు అలికి ముగ్గులు పెట్టింది. ఇదంతా చూసి మొఖం ముడుచుకున్నది రాజమ్మ. 'పెద్దిళ్ళలో పాచిపనులు చేసింది గదా.... ఆ ఊహలూ ఆ తీరుబాట్లూ మా కెట్లా వుంటయ్,' అన్నది విదిలించుకుంటూ.

రాజమ్మ భర్త వెంకటేశ్వర్లు నేతపనిలో. నికరంలేని కొండయ్య ఆదాయంతో అస్తుబిస్తుగా జరుగుతున్న సంసారం అది. ముగ్గురు మనుష్యులంటే మూడు శేర్ల బియ్యం ఉడకాలి రోజుకి. గౌరి రావటంతో మరీ కటకట అయిపోయింది.

''కోవూళ్ళో కూలి పనులు బాగా దొరుకుతున్నయ్యంట. అక్కడికెళ్ళిపోదాం'' అన్నది గౌరి ఒకనాడు. కొండయ్యకు భయం వేసింది. 'ఏం....యిక్కడ బాగున్నాం గందా' అన్నాడు. 'ఎప్పుడూ యిట్లానే ఉందామా? అక్కడి కెళ్తే నాలుగు డబ్బులు సంపాదించుకోవచ్చు' అన్నది గౌరి. ఒకరి క్రింద పడివుంటూ దొరికింది తిని కాలం వెళ్ళమార్చటం గౌరికి సరిపడలేదు. ఆ అమ్మాయికి చాలా ఊహలున్నాయి. పుట్టింట్లో లేమిలో ఉన్నప్పుడు ఒక్కవిషయం బాగా గ్రహించింది గౌరి. సొంతమైనది ఒకటి, పూరిపాకైనా సరే, ఉండాలి మనిషికి. లేకుంటే గౌరవం ఉండదు. అయిన వాళ్ళు కూడా వాళ్ళని మనుష్యులుగా గుర్తించరు. ఒకమనిషి కడుపునిండా తింటున్నాడో లేదో అసలు పస్తే ఉంటున్నాడో ఇంటిలోపల ఏమి చేసుకుంటున్నాడో ఎవరికీ అక్ఖర్లేదు. వాళ్ళకు సొంతయిల్లు ఉన్నదా లేదా అన్నదే కావాలి. కనుక ముందు సొంత ఇల్లొకటి ఏర్పరచుకోవాలి. అందులో పేముమంచమూ ఉప్పులూ పప్పులూ డబ్బాల్లో పోసిపెట్టుకునే చిన్న అలమారా కావాలి....ఇంకా కొన్ని వస్తువులున్నాయి కావలసినవి. మప్పితంగా సంసారం చేసుకుంటూ ఒకరి పెత్తనం క్రింద ఉండకుండా....గౌరి పట్టుబట్టింది.

''పెళ్ళాం క్రింద ఒంగిపొయ్యేవాడివి'' అని కాసేపు తమ్ముణ్ణి తిట్టింది రాజమ్మ. కాని వాళ్ళు వెళ్ళడానికి గట్టి అభ్యంతరం చెప్పలేదు.

* *

కోవూళ్ళో ఊరి చివరన పాతపాక. సొంతదారులు బ్రతుకు గడవక చీరాల వెళ్ళిపోయారు. ఏడాదినుండి మనిషి నివసించక పాడుబడినట్లుంది. నెలకు రెండురూపాయిలు అద్దె యిచ్చేట్లు బేరమాడి దానిని తీసుకున్నాడు కొండయ్య. అది పందుల దొడ్డిలాగున్నది. తలుపు లేదు. ఇల్లంతా ఎలుకలూ పందికొక్కులూ త్రవ్వి పోసినై. ఇంటిచుట్టూ ఖాళీచోటు ఉన్నా పిచ్చి మొక్కలు పెరిగిపోయినై. ఆ యింట్లో చేరారు. తడికతలుపు పెట్టుకున్నారు. పిచ్చిమొక్కలు శుభ్రంచేసి నేల గట్టి చేసుకున్నారు. అందులో సొరతీగే, గన్నేరు మొక్క, అరటి పిలకలూ పెట్టింది గౌరి. నిదానంమీద ఇంకొంచెం తాటాకులు తెచ్చి చుట్టూ గోడగా ఉన్నదడిని గట్టి చేసుకున్నారు. ఎలుక కన్నాలు గులకరాళ్ళతో పూడ్చి, ఇల్లు ముమ్మారు ఆవుపేడతో అలికి ముగ్గులు పెట్టేసరికి కళకళ్ళాడింది. ఉన్న నాలుగు కుండలూ, చిన్నగుడ్డల పెట్టే అన్నీ వైనంగా సర్దుకున్నది గౌరి. ఆ యింటిని చూసుకునేసరికి మనసు పొంగిపోయింది. ఎప్పటికైనా మనం సొంతయిల్లు వేసుకోవాలి'' అని చెప్పింది గౌరి కొండయ్యతో.

ఇద్దరూ రోజూ కూలి తెచ్చుకుంటున్నారు ఒకరి సంపాదన ఖర్చుపెట్టి రెండోది ఇంటి కోసం దాయాలనుకున్నారు. కూలిరేటు పనుల ఒత్తిడిని బట్టి రూపాయినుండి నాలుగు రూపాయిలవరకూ మారుతూ ఉంటుంది. గౌరి తెలివిగలది. అణా తోటకూరలో సగం రోజులు గడుపుతుంది. ముదిరిపోయిన బెండకాయలూ పుచ్చువంకాయల్లోంచీ షుమారు పాటివి ఏరుకుని చవుగ్గా తెస్తుంది. ఒకణా మజ్జిగా పావలా కందిపప్పూ తెచ్చి బ్రహ్మాండంగా వంటచేస్తుంది.

''ఇంత బక్కగా ఉన్నావు చూడటానికి. ఇంటాబయటా అంత చాకిరీ ఎట్లా చేస్తున్నావో ' అంటుంది ప్రక్కనుండి చంద్రమ్మ వాళ్ళ కష్టానికి తగ్గట్లుగా యేడాది గడిచేసరికి మూడువందల రూపాయిలు మిగిలినై. నిలవ చేసుకున్న డబ్బును తలచుకొని యేనుగెక్కినంత సంబరపడి పోతున్నది గౌరి. చుట్టూ చెట్లతో యిల్లు ముచ్చటగా ఉన్నది. దాని పూర్వస్థితిని మరచిపోయి ''ఇంత శుభ్రమైన యింటిని రెండు రూపాయిల అద్దెకు ఎట్లా ఇచ్చారబ్బా'' అని ఆశ్చర్యపోతున్నారు చూసిన వాళ్ళు. గౌరమ్మ చేతిని మెచ్చుకుంటున్నారు యిరుగు పొరుగులు.

గౌరి గర్భవతి అయింది. అసలే అర్భకపు మనిషి. రానురాను నీరసించి అయిదో నెల ఒచ్చేసరికి రోజూ పనికిపోలేక పోయింది. చంద్రమ్మ సలహామీద డాక్టరమ్మ దగ్గరికి ఆస్పత్రికి వెళ్ళింది. ఆమె రాసిచ్చిన మందులు తెచ్చుకోడానికి బుద్ధి పుట్టలేదు. తన సంపాదన లేకపోగా నిలవ డబ్బులోనుంచి తీయటమా? అని మధనపడింది. ఇల్లు కోసం దాచిన డబ్బును యింకోదానికోసరం తీయకూడదు.

''టైము కలిసొచ్చినప్పుడు యెప్పుడు రావాల్నో అప్పుడు అదే వస్తుంది. ఊరికే ఆలోచన యెందుకు?'' అన్నాడు కొండయ్య.

''ఆలోచనలేకుండా మన ప్రయత్నం లేకుండా దానంతటదే ఆకాశం నుంచీ ఊడిపడుద్దా?'' అని కోప్పడింది గౌరి.

ఊళ్ళో అక్కడక్కడా వున్న ఖాళీస్థలాల ధర లెంతల్లో వున్నాయో కనుక్కుంటున్నది. అయిదువందలు పెడితే యింటి మోయినం స్థలం. రెండు వందలు ఖర్చుపెట్టి రెండు నిట్రాళ్ళమీద పాకదించుకుంటే, అందులో చేరి, డబ్బులు చేతికొచ్చిన కొద్దీ రాతి గోడలతో గట్టి యిల్లు వేసుకోవచ్చును. ఏడు వందలు ఎన్నాళ్ళకి సమకూడతాయో! ఈ ఊహల్తో ప్రాణం పోసుకుంటున్నది. గౌరి కట్టుకున్న చీరనిండా కుట్లున్నా. ఒంట్లో నీరసం ఉన్నా ఉత్సాహానికి తరుగులేదు. ఓపికున్నప్పుడు అల్లాగే కొండయ్య ఒద్దంటున్నా వినకుండా కూలికి వెళ్తున్నది. ఒక రోజు వెళ్తే వారంరోజులు పడుకుంటున్నది.

ఒళ్ళు నీరుపట్టి కానుపు కష్టమైంది. అర్భకపు పిల్లవాడు నల్లగా ముక్కు పురుగులాంటి కొడుకు పుట్టాడు. తండ్రి పేరు మీద చిన వెంకట సుబ్బయ్య అని పేరు పెట్టాడు కొండయ్య. కాన్పు కోసం కూడ


పెట్టుకున్న డబ్బులోనుంచి వందకుపైనే తీశారు. గౌరికి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. "నేను లేవాక పనిలోకిపోతే ఎన్నాళ్ళల్లో సంపాదించొచ్చు లెద్దూ" అనుకుని ధైర్యం తెచ్చుకుంది.

పసిబిడ్డతో ఒంట్లో నీరసంతో కూలికి వెళ్ళలేకపోయింది. "పిల్లవాడు కూచునే వాడైతే చంద్రమ్మ దగ్గర ఒదిలి వెళ్ళొచ్చు" అనుకుంది. అంతలోగా ఊరికే ఉండటం ఎందుకని పంచాయతీ ప్రెసిడెంటు ఆనందయ్యగారింట్లో పాచిపనికి కుదిరింది. ఒక ఒకపూట అన్నం, నెలకు అయిదు రూపాయిలు జీతం.

సుబ్బడి జలుబులూ జ్వరాలూ విరేచనాలకు మందుల్తో, ఒకడి సంపాదనతో, పనులు పలచబడి కూలి రేటు తగ్గడంతో నిలవడబ్బు హరించుకుపోతున్నది.

"ఒక్కరూపాయి మిగులబెడితే రెండు రూపాయల ఖర్చు తగులుతున్నదే" అన్న చింత పట్టుకుంది గౌరికి. నెలజీతాలు తెచ్చుకునేవాళ్లు మిగల్చగలరు గాని, కూలిడబ్బులు ఎప్పటికప్పుడు ఖర్చయిపోయేవే అనుకుంది. కొండయ్యకు యేదైనా ఆఫీసులో పని యిప్పించమని ఆనందయ్యగారి భార్యను ప్రాధేయపడింది. పని జాగ్రత్తగా చేసి, ఒప్పుకునేదానికంటే యెక్కువగానే చేసి మెప్పిస్తున్నది.

ఇప్పుడు గౌరి భవిష్యత్తును గురించి కనే కలల్లో ఇల్లు ఒక్కటే ఉండటంలేదు. ఆ యింట్లో చినసుబ్బడు ఉంటున్నాడు. వాడు పెరిగి పెద్దవాడై చదువుకొని ఉద్యోగస్థుడై— ఎంత కష్టపడినా వాడిని చదివించాలి. బాగా చదివించాలి. ఆనందయ్యగారి కొడుకు నారాయణయ్య బి.ఏ. చదివాడు. నెల తిరిగేసరికి కష్టపడకుండా రెండొందలు తెస్తాడు. సుబ్బడు కూడా కష్టపడకుండా కుర్చీలో కాలుమీద కాలువేసుకొని కూర్చొని సంపాదించాలి. అంతలోగా రాతిగోడల్తో రెండంకణాలవి రెండు గదులు వేసుకోవాలి. దొడ్లో మంచి చెట్లు పెట్టాలి. కాయలవీ, పువ్వులవీ




కూడాను. వాడు సొంతయింట్లో దొరబాబు లాగా....

కొండయ్యకి వాటర్‌మేన్ పని ఒచ్చింది. నెలకి అరవై రూపాయిలు జీతం. మామూలుగా కొండయ్య కూలికి పోయి తెచ్చే సంపాదనకంటే తక్కువే. కాని నెల తిరిగేసరికి ఖచ్చితంగా ఒక్కసారిగా డబ్బు కళ్ళ బడుతుంది. గౌరికి ప్రాణం లేచివచ్చినట్లయింది. కబురు వినగానే. చినసుబ్బడిదగ్గరికెళ్ళి బెదిరిస్తున్నట్లు వేలు ఆడిస్తూ "ఒరే, అయిదోఏడు రాగానే బళ్ళో వేస్తా విన్ను. బాగా చదువుకోవాలి మరి" అన్నది. వాడిని ముద్దు పెట్టుకుంది. అప్పుడే యిల్లు సంపాదించుకున్నట్లు ఆనందపడిపోయింది. అమ్మగారిచ్చిన పాతచీర కట్టుకుని తల దువ్వుకుని కొడుకుని చంకనేసుకుని వెళ్ళి తాను ఎంచుకున్న ఖాళీస్థలాలు చూచివచ్చింది. సొంతదారుల దగ్గర యిరుగుపొరుగుల దగ్గర వాటి మంచిచెడ్డల గురించీ ధరలుతగ్గే అవకాశం గురించీ కూపీల్లాగుతున్నది. ఇహ డబ్బు చేతిలోకి రావటం ఆలశ్యం. అంతే.

ఎక్కడో చీరాలలో స్థిరపడిపోయినవాళ్లు, కొండయ్య వుంటున్న పాక సొంతదార్లు ఎవరిదో పెళ్ళికని నెల్లూరు ఒచ్చారు. దారిలో ఇల్లు చూసుకుందామని ఆగారు. ఇల్లు చూసి, ఇరుగుపొరుగుల్తో మాట్లాడినాక అద్దె పెంచాలని అనుకున్నారు. "మేము యిక్కడికే ఒచ్చెయ్యాలని అనుకుంటున్నాం. మీరు మా యిల్లు ఒదిలెయ్యండి" అన్నారు. ఎక్కడ కనుక్కున్నా కాస్త పూరింటికే పదిరూపాయిల అద్దె అడుగుతున్నారు. ఈ పడిపోయిన పాకని తీసుకుని గట్టిచేసుకుని నిలబెట్టేసరికి ఇన్నాళ్ళబట్టీ దిక్కూ దివాణం లేకుండా పడివున్నదానికి విలువొచ్చేసింది. ఇంటివాళ్ళ కన్ను కుట్టింది. ఆఖరికి బేరసారాలయ్యాక ఇంటివాళ్ళు ఒచ్చేవరకూ నెలకు అయిదు రూపాయిలు అద్దె యిస్తూ ఆ యింట్లో కొండయ్యే ఉండేట్లు ఏర్పాటయింది.

అద్దె ఎక్కువైందన్న బాధ ఉన్నా, ప్రస్తుతానికి ఏదో ఒకవిధంగా గండం గడిచిందని సంతోషించారు. సుబ్బడు ఒళ్ళు చేశాడు. మనిషిని గుర్తుబట్టి నవ్వుతున్నాడు. రాత్రిళ్ళు అన్నాలు తిన్నాక సుబ్బణ్ణి ఆడించుకుంటూ కబుర్లు చెప్పుకుంటారు ఇద్దరూ. అవసరాన్ని మించి మాట్లాడ్డం అలవాటులేని గౌరికూడా నవ్వుకుంటూ సంతృప్తితో కబుర్లాడుతున్నది. కొండయ్య తన యజమాని కబుర్లు చెప్తే గౌరి ఆనందయ్యగారి ఇంటి విషయాలు చెప్తుంది. ముఖ్యంగా వారి ఏకైక పుత్రుడు నారాయణబాబు గురించి. ఆ

అబ్బాయి గౌరికంటే చిన్నవాడుకాదు. కాని ఎందుకో గౌరి మనసులో ఆ అబ్బాయికీ సుబ్బడికీ అవినాభావసంబంధం ఏర్పడి పోయింది. సుబ్బడు పెద్దయితే నారాయణ బాబులా అవ్వాలి. అందుకే గౌరి ఆ అబ్బాయికి తాజావార్తలన్నీ తూచా తప్ప కుండా చెపుతూ ఉంటుంది. ఆ అబ్బాయి బలే తమాషాగా మాట్లాడుతాడట. వాళ్ళమ్మ గారిని అల్లరిపట్టిస్తాడు. ఆమె దేవుళ్ళని వేళా కోళం చేస్తాడు....అంత వినాయకుడూ, పాపం, ఆ చిన్న ఎలుకమీద కూచుంటే అది నలిగి ఛస్తుంది. యమధర్మరాజు వాహనంగా ఒక ఎద్దో ఆవో దొరక్క పాపం అందాకా దున్నపోతునెక్కి తిరుగుతున్నాడు. ఈశ్వ రుడు మంచి వాసనపౌడరు దొరక్క పిచ్చి బూడిద పూసుకుని కంపుకొట్టే పాత పులి తోలు చుట్టుకొని....'అయ్యో ఏమిదేవుళ్ళమ్మా నీ దేవుళ్ళు!' అని నవ్వుతాడు. 'అసలు దేవుడు మనిషిని చేశాడా! మనిషి దేవుణ్ణి చేశాడా? మనిషి తలచుకొని చెప్పుకొని గుళ్ళుకట్టి పూజించక పోతే దేవుడు ఎట్లా ఉంటాడు?' అంటాడు. అన్నీ తలక్రిందు లుగా మాట్లాడుతాడట. అమ్మగారు 'ఈ కాలపు చదువుకున్న కుర్రాళ్లు! నాస్తికులు!' అని నవ్వు కుంటారుట.

"ఇన్ని గుళ్ళల్లో ఇందరు దేవుళ్ళని పెట్టుకొని ఎందుకు పూజలు చేసుకుంటున్నాం? దేవుడున్నాడని గందా" అంటాడు కొండయ్య.

"దేవుడు లేకపోతే ఇంత ప్రపంచాన్ని యెవరుచేశారు? మనిషిని యెవరు చేశారు?" అంటుంది గౌరి.

"నాలుగు రూపాయిలు మిగుల్చుకోడానికి వీల్లేకుండా వున్నదే. ఎంత ఆలోచనతో యెంత మప్పితంగా సంసారం జరుపు కుంటున్నా యెక్కడికక్కడే సరిపోతున్నదే' అనుకుంటారు. ఇంకో యింట్లో పాచిపనికి కుదురుకున్నా, కూలికిపోయినా, యీపసివాడిని ఏం చేతునా అని ఆలోచిస్తుంది గౌరి. వాళ్లకి ఏదారీ దొరకదు. ఆఖరికి పిల్లవాడు కూచుంటే కూలి డబ్బులు తెచ్చికూడ బెట్టనా! అని ధైర్యం తెచ్చుకుంటుంది గౌరి.

సంభాషణ అలా సాగిసాగి నిద్రలోకి జారిపోతుంది.

* * *

రామ తీర్థం సముద్రపు వొడ్డున వున్నది. ఇసుక నేల. దూరాన సరుగుడు తోటలు. ఇంకా అవతల సముద్రం. ఒకనాటి గొప్ప దనాన్ని సూచించే గుడి. అక్కడ ఏటా తిరుణాళ్లు జరుగుతాయి. అప్పుడు జనం సముద్రంలాగా వొచ్చి పడతారు. తిరునాళ్లయి పోగానే మామూలుగా ఖాళీగా వుండే పల్లె టూరు అది. చల్లటి సముద్రపు గాలిలో తేలుతూ తూర్పుకోస్తా సూర్యుడి వెలుగులో మునుగుతూ సోమరిగా నిద్రపోయే పల్లెటూరు ఇళ్లు చిన్నవైనా దూర దూరంగా చుట్టూ ఖాళీ చోటుతో వుంటాయి. కొన్ని పెంకుటిళ్లు కొన్ని పూరివి. కొన్ని గుడిసెలు చుట్టూ వుండే ఖాళీ చోట్లలో అక్కడక్కడా బాదం చెట్టూ వేపచెట్టూ కరివేపాకు చెట్టూ గాలిలో హాయిగా సోమరిగా కదలాడుతుంటాయి.

ఆ ఊళ్లో ఒక పూరిల్లు చుట్టూ విశాలంగా చోటు. లోపల్నుండి అవిరామంగా టాక్ టాక్ మంటూ ఉంటుంది. సుబ్బయ్య నేసే మగ్గం. బయట ఎంకమ్మ పిల్లల సాయంతో చిలపల్ని ఎల్చుతూ కండెలు చుడుతూ పని చేసుకుంటూ ఉంటుంది.

పూరింట్లో ఓ ప్రక్కగా నేలలోనికి త్రవ్విన మగ్గం గుంటలో, ఆ సజీవ సమాధిలో వేడికి కరిగిపోతూ, నిర్విరామంగా మసకవెల్తురులో పనిచేస్తూ కాలం వెళ్ళ మార్చుకున్నాడు, సుబ్బయ్య. ఇప్పుడు ఆ మగ్గం దగ్గర కరిగిపోతున్నది సుబ్బయ్య పెద్దకొడుకు శేషయ్య.

ఒక రోజున ఆ రామతీర్థంనుండి తల్లి ఎంకమ్మని వెంటబెట్టుకుని తమ్ముని దగ్గరకు కోవూరు ఒచ్చాడు శేషయ్య మనిషి ఒరుగు లాగై పోయి కళ్ళల్లో ప్రాణాలు పెట్టు కున్నాడు. అక్కడ నేతపనిలో జరుగుబాటు బాగా లేదట. పెళ్లానికి రోగం. తల్లిని పోషించడానికి శక్తిలేక తమ్ముడి దగ్గర ఒదిలి వెళ్దామని ఒచ్చాడు. తమ్ముడు ఉద్యోగస్థుడయ్యాడు గనుక, చీకూ చింతా లేకుండా కాలం గడుస్తున్నది గనుక, వీలుంటే తనకూ అలాంటి పని చూసిపెట్ట మని మరి మరీ చెప్పి వెళ్ళాడు.

ముడుతలు పడిన పచ్చటి ఒళ్లూ, పై రెప్ప బరువుతో సగంవరకూ మూసుకు పోయిన పెద్ద కళ్ళూ, చిన్నవేలు ముడిలోకి యిమిడిపోయిన వెండిపోగుల్లాంటి, జుట్టూ. ఎన్నో బాధల్నీ అనుభవాల్నీ జీర్ణించుకున్న నిండుదనం కన్పిస్తాయి ఎంకమ్మలో. తొందరపడి ఎంకమ్మని ఎవరూ పొల్లుమాట అనలేరు. రాజమ్మని కాదన్న గౌరి ఎంక మ్మని కాదనలేకపోయింది. ఎట్లైనా కష్టపడి కాస్త ఇల్లు ఏర్పాటు చేసుకుందామనుకుంటే యీ దిగలాగుడేమిటా అనుకుంది. ఆలో చించుకున్నది. ఆఖరికి ఆనందయ్యగారి ఇంటి పనినీ, చినసుబ్బడినీ అత్తమీద ఒది లేసి కూలికి బయల్దేరింది....కాని కూలి డబ్బులు తెస్తున్నా ఏమీ మిగలటంలేదు. ఇంకో మనిషికి తిండి జరగాలి. ఎంకమ్మ చిరిగి పేలికలైన చీర కట్టుకుంటున్నది. మారు చీరలేదు. ఆమెకు రెండుచీలలు కొన వలసి వచ్చింది. గౌరికి మనసు కుతకుత ఉడికిపోయింది. కోపంతో నిరాశతో తనూ ఒక చీర కొనుక్కున్నది. మొఖం మొట మొట లాడించుకుంటూ తిరిగింది. కొండ య్యకు పెద్దపని వస్తే తప్ప ఈ చిక్కు తీరేట్లు కనపడలేదు. అందువలన, ఆపని యిప్పిస్తారన్న ఆశతో, కొండయ్య పని చేస్తున్న ఆఫీసరుగారింట్లో పాచిపని ఒప్పు కున్నది. కొండయ్య 'రెండు పనులూ చెయ్య లేవు. కూలిపని మానెయ్యి' అన్నాడు. కాని గౌరి వినలేదు. ప్రొద్దున్నే వాళ్ళింటి కెళ్ళి పాచిపని చూసుకుని తొమ్మిదింటికి కూలికి వెళ్తుంది. కూలిపని నుంచి సరాసరి వాళ్లింటి కెళ్ళి సందెకసువూ అంట్లగిన్నెలూ చూసు కుని తిరిగి ఇల్లు చేరేసరికి చీకటి పడుతుంది. పిల్లవాణ్ణి చూడటంలేదు. ఇంటిపట్టున ఉండ

టంలేదు. ఏమిటో ఆరాటం నిలవనివ్వదు. మరమగ్గంలా తిరిగి తిరిగి కరిగిపోతున్నది. నల్లటి మనిషి మరీ నల్లబడింది. మరీ సన్న బడింది.

కొండయ్యకి మూటయిరవై రూపాయిల జవానుపని ఒచ్చాక మళ్ళీ గౌరి మొఖంలో నవ్వు కనబడ్డది. ఆశ మనిషిని ముందుకు లాక్కుపోతుంటే ఎక్కడనుంచీనో ఏనుగు బలం ఒచ్చినట్లు చేసుకుపోతున్నది పని. మళ్లీ నాలుగునెలలు గడిచేసరికి మూటయాభై రూపాయిలు దాచుకున్నారు.

రామతీర్థంనుంచీ కొండయ్య చిన్నక్క లక్ష్మమ్మ నాలుగేళ్ళ కూతుర్ని వెంటబెట్టుకొని ఒచ్చింది. లక్ష్మమ్మకు నాలుగేళ్ల క్రితం భర్త పోయాడు. అన్న శేషయ్యదగ్గరే వుండి కూలిచేసుకుని తనకూ కూతురికీ పొట్ట నింపు కొంటున్నది. తల్లి యిక్కడే వున్నది గనుక చక్కగా సంపాదించుకొంటున్న తమ్ముడి సంసారం చూసిపోదామని వచ్చింది. అదీ గాకుండా ఒంట్లో ఒకనాడు బాగుంటే ఒక నాడు ఉండకుండా ఉన్నది.

గౌరికి ఏమనుకోవాలో తోచలేదు. ఎప్పుడో పెళ్లినాడు చూసింది ఆవిణ్ణి. కడుపు నిండా తింటూ లక్షణంగా ఉన్నామన్న గొప్ప దనం ఆడబిడ్డ ముందు చూపుకోవడం తృప్తి గానే అనిపించినా వాళ్లవలన రోజుకు రూపాయి ఖర్చుగదా అన్న ఆలోచన దొలు స్తూనే వున్నది లోపల. అక్కడికీ నాలుగు రోజులు చూసింది. "ఇట్లాగ ఒకరింటిమీద వచ్చిపడితే భరించడానికి మనమేవన్నా మహ రాజులమా" అన్నది కొండయ్యతో. "ఎప్పుడో ఒకతడవ వచ్చిన అప్పజెల్లెల్ని పొమ్మని ఎట్ట జెప్పేది?" అన్నాడు కొండయ్య. "నాతోపాటు కూలికి రారాదు?" అవడిగింది లక్ష్మమ్మను. ఆమె పలకలేదు.

ఇరవై రోజులు గడిచినా లక్ష్మమ్మ కదిలే జాడ కనబడలేదు. గౌరికి మనసు మండి పోతున్నది. కొండయ్యమీద కోపం వచ్చింది. "చేతగాని మొగాడు. ఇల్లు కట్టుకుందామనీ బాగుపడదామనీ ఆలోచన ఉంటేగా? అలగా మనుషులు" అనుకుంది. కూరానారా దగ్గర పిక్కింది. బియ్యం చాలకుండా తెచ్చింది. డబ్బులేదని గొణిగింది. ఆఖరికి ఉక్రోషం పట్టలేక పదిహేను రూపాయిలకి చీరతెచ్చి పడేసింది. "నేను కూలికి పోతన్నా. మధ్యాన్నం బస్సులో వెళ్ళు" అని చెప్పేసి పోయింది. లక్ష్మమ్మ తమ్ముడిదగ్గరా అమ్మ దగ్గరా ఏడ్చుకుని చీర తీసుకుని వెళ్ళి పోయింది. ఎంకమ్మ ఊ ఆ అనలేదు.

* *

చినసుబ్బడికి అయిదోఏడు ఒచ్చింది. ఇంతవరకూ ఇంటిస్థలం కొనడానికి వీలు పడలేదు. ఎప్పుడూ ఏదో ఒక అడ్డంకి. సుబ్బణ్ణి బడికివెయ్యాలని గుర్తు ఒచ్చినప్పుడు "కాస్త డబ్బుకూడితే కూలిపని మానేసి తీరిక చిక్కినాక చేర్చాలి. ఎప్పుడో" అను కుంటుంది బరువుగా.

శేషయ్య దగ్గర్నుండి ఉత్తరం ఒచ్చింది. "భార్యకీ, పిల్లాడికీ ఇద్దరికీ చాలా జబ్బుగా ఉన్నది. మందులిప్పించడానికి డబ్బులేదు. ఒక వందరూపాయిలు అప్పుగా సర్దు" అని. "మీ నాయన ఇల్లు అక్కడుండేది వాళ్లకే ఒదిలేశాం. మనం పోయి భాగం పెట్టమనొద్దు. కాని వాళ్ళ కష్టాలు మనం తీర్చలేము. వాళ్ళని మెడకట్టుకుంటే మనమూ మునిగిపోతాం" అన్నది గౌరి. 'నిజమే' అన్నాడు కొండయ్య ఇంకేమనాలో తోచక. ఎంకమ్మ అది విని ఏడ్చింది. "నీ అన్నరా. ఇంటిల్లపాది తిండికి చాలక పస్తులు పడుంటున్నారు. తిండిలేని రోగాలు అవి. వాడిని తల్చుకుంటే నాకు కూడు సయించటంలేదు. దేవుడు మేలుచేసి వాడూ కష్టాల్లోనుంచీ బయటపడడా. అందాకా తోడబుట్టిన వాడివి. ఆదుకోకపోతే ఎట్లాగ" అన్నది. "చూద్దాం" అన్నాడు కొండయ్య. గౌరికి తెలియకుండా ఇరవై రూపాయిలు మనియార్డరు పంపించాడు. నాలుగురోజుల తర్వాత శేషయ్య కార్డు వ్రాశాడు. పిల్లవాడు చచ్చిపోయాడు. భార్యకు మందులిప్పిస్తున్నా నని.

రివాజు ప్రకారంగా కొండయ్యా గౌరీ రామతీర్థం వెళ్ళి వాళ్ళను ఓదార్చి బట్టలుపెట్టి ఒచ్చారు.

"చుట్టూ వుండే ప్రపంచంతో సంబంధం లేకుండా మనిషి వుండడు. తనకు తోచి నట్లుగా ఆలోచన్లు చేసుకుంటే అవి జరగవు. పేదవాడు కష్టాల్లోంచీ పేదరికంలోనుంచీ బయటపడ్డానికి వీల్లేదేమో" అనుకుంది గౌరి. అనుకున్నది యేదీ జరక్కపోవటంతో యీ మధ్యన చాలా యెదిగిపోయింది.

ఎంకమ్మకు కడుపు నొప్పి ప్రారంభమై రానురాను ఎక్కువై పోయింది. నెలరోజులు శొంఠీ వామూ ఆముదమూ యిచ్చి చూశాక ఆస్పత్రికి తీసుకెళ్ళారు. "కాన్సరు జబ్బు. వెంటనే మెడ్రాస్ తీసుకెళ్లాలి" అన్నది డాక్టరమ్మ. వాళ్ళకు ఏం చెయ్యటానికీ పాలు పోలేదు. ఎంకమ్మకు నొప్పి భరించరానిదిగా వున్నది. "ఇటువంటి జబ్బులకు మంచి మందిచ్చే నాటువైద్యుడు పక్క వూళ్ళో వున్నాడు" అని తెలిసింది. అతనికి పది రూపాయిలిచ్చి మందు చేయించారు. వేడి తగ్గటానికి రెండు రోజులకోసారి పావలా యిచ్చి బత్తాయిపండు తెచ్చి యిస్తున్నాడు కొండయ్య. ఆ మందువలన ఎంకమ్మకు నొప్పి కాస్త తగ్గినట్లుంది. మనిషి మాత్రం రానురాను ఎముకలపోగు అయిపోతున్నది చూస్తుండగానే.

ఒకనాడు రాత్రి అన్నం తింటుండగా కొండయ్య చెప్పాడు. గౌరి యెంచుకున్న స్థలాలు రెండూ అమ్ముడు పోయాయి. ధరలూ పెరిగినాయి. ఆరేడు వందలులేనిదే యింటిమోయినం స్థలం దొరకదు.

మనసులో పుట్టే దుఃఖాన్నీ ఆనందాన్నీ ఆశనీ నిరాశనీ యెవరూ యింకోరికి చెప్ప లేరు. వాటిని గురించి మాత్రమే చెప్పగలరు. చెప్పగా వెలువడేవి పేలవమైన మాటలేగాని అనుభవాలు కాదు. గుండెను నింపుతూ దొలుస్తూ పనిచేసేదాన్ని కొంతవరకూ ఊహతో గ్రహించుకోగలమేమో!

చలీ చీకటీ కలిసి గడ్డకట్టినట్లుగా మృత్యువులాంటి ప్రశాంతత లోకాన్ని ఆవ

రించుకున్నది. తాను ఏర్పరచుకున్న చిన్న ఇంట్లో తాను వెలిగించుకున్న చిన్న వెల్తురులో తప్ప మనిషి ఉండటానికి వీల్లేకుండా వున్నది. బయట చలీ, నీడలూ, వెల్తురు నివ్వలేని నక్షత్రాలతో ఆకాశమూ—అన్నీ గుండెల్లో బరువూ గుబులూ పుట్టిస్తున్నై.

గౌరికి చచ్చిపోతే బాగుండు ననిపించింది తన నులక మంచం తీసుకుని బయట కెళ్ళింది. 'ఈ సలిలో....' అంటున్న కొండయ్యమాట విన్పించుకో లేదు. నిండు చంద్రుడు గుండెనిండా ఏడుపు పేరుకున్నట్లు ఎర్రగా ఆకాశంలోనికి వచ్చాడు. దుఃఖంలో నుంచీ నిరాశలోనుంచీ యెలా బయటపడాలో తోచనట్లు ఆకాశానికీ భూమికీ మధ్యన బందీ లాగా కళా విహీనంగా నిలబడి పోయాడు. నల్లటి శీతాకాలపురాత్రి ఆ చంద్రుడి ఎరుపుకు కరిగిపోలేదు. మసక వెల్తురులో గౌరికి తల నిండా ఆలోచనలు ముసురుకున్నాయి. ఎక్కడ చూపినా ఏమిటో నీడలు కదుల్తున్నట్లు కనిపించి భయమేసింది, 'అమ్మయ్యో ఈ మసక చీకట్లో ఏ దయ్యమన్నా వొచ్చి మీద కూచుని పీక నులిమేస్తే....' అనుకున్నది, భయంతో ఊపి రాడలేదు. మంచం తీసుకుని మళ్ళీ యింట్లోకి వెళ్లింది.

ఓ మూలన యెంకమ్మదగ్గర ముడుచుకు పడుకున్నాడు చిన సుబ్బడు. ఎంకమ్మ మూలుగుతూ ఒక ప్రక్కకు వొత్తిగిలింది. దీపం వెల్తుర్లో పత్తికాయల్లా కనబడు తున్నవి ఆమె కళ్ళు. కొండయ్య అప్పుడే మంచి నిద్రలోకి జారిపోయాడు. ఎంత సేపటికీ నిద్ర పట్టని గౌరి ఊరికే చీకట్లోకి చూస్తూ వుండి పోయింది.

* * *

గౌరి వాళ్ళ కట్టలో కూలీలు రెండు మైళ్ల వతలకు నారేతకు పోతున్నారు. మధ్యాహ్నం అందరికీ అన్నాలు తీసుకురావటానికి గౌరి ఊళ్ళోకి వచ్చింది. ఎంకమ్మ పోయి నప్పటి నుంచీ మధ్యాన్నాలు ఇంటికి వెళ్లి సుబ్బడికి అన్నం పెట్టి, తనూ తిని, అందరి అన్నాలు గంపలో పెట్టుకుని తెస్తుంది.

ఆరోజు మిట్ట మధ్యాన్నం అన్నాలగంప నెత్తిమీద పెట్టుకుని పొలాల గట్లమీద నడిచి వొస్తున్నది. చూపు మేరలో మనిషి తిరగటం లేదు. కళ్లముందుగా ఏదో నీడలాంటి నల్లని ఆకారం కదిలింది. భయపడి పరుగు పుచ్చుకుంది గౌరి. బొక్క బోర్లా పడి పోయింది. గంపదొర్లి అన్నాలు నేలపాలై పోయాయి. దూరాన్న పొలంలోని కూలీలు చూచి పరుగెత్తుకుంటూ వొచ్చారు. మొఖాన్న నీళ్ళుకొట్టి తెలివి వొచ్చినాక ఇల్లు చేర్చారు. పిచ్చి చూపులు చూస్తున్నది గౌరి. గాలి తగిలిందన్నారు. పడినచోటు మంచిది కాదన్నారు మండలూ మంత్రాలూ వేయించారు. దయ్యం దిగలేదు.

రాజమ్మను పిలుచుకొచ్చాడు కొండయ్య 'ఆ దోవన యెందరు మనుషులు పోవటం లేదు! దీనినే పట్టుకోవాలా ఆ దయ్యం.... రాగానే వేరుకాపరం పెట్టించింది. దాని మనసు మంచిదికాదు. అందుకే దయ్యం పట్టుకుంది' అని గొణుగుతూనే వుంది రాజమ్మ. ఆస్పత్రి డాక్టరు చూసి యిదంతా బలహీనం వలన అని నలభై రూపాయిలకు మందులూ ఇంజక్షన్లూ రాసిచ్చాడు. వాటివలనా లాభం కన్పించలేదు.

రెండు రూపాయిల ఛార్జీమార్గంలో వుండే ఒక పల్లెలో ఒకామె మీదికి ప్రతి శుక్రవారం చిన్నమ్మ తల్లి వొస్తున్నదనీ, దయ్యాల్ని బాగా వొదల గొడుతున్నదనీ, జబ్బులు నయంచేస్తున్నదనీ తెలిసింది. ఒక శుక్రవారం గౌరిని వెంటబెట్టుకుని చిన సుబ్బణ్ని కూడా తీసుకుని బస్సెక్కి అక్కడికి వెళ్లాడు కొండయ్య.

ఊరు చిన్నది. ఒక చివర్న పూరిల్లు ఇంటికి పడమరగా పెద్ద మైదానంలో షుమారుగా మూడువందల మంది జనం. పాకదగ్గర యెత్తుమీద ఒక కుర్చీవేసివున్నది. జనం కోలాహలంగా వున్నారు. అందరూ అమ్మవారి మహిమల్ని గురించే చెప్పుకుంటున్నారు. కొండయ్యా గౌరీ ఎంతతోసుకుపోయినా గుంపు చివర్నే మిగిలారు. కుర్చీదగ్గరగా చాపమీద కూర్చుని భజన చేస్తున్నవాళ్లల్లో పసుపు చీరకట్టుకున్న ఆమె మీదికే అమ్మవారు ఒస్తుందన్నారు. అందరూ కూర్చోమని కేకలేస్తున్నా లెఖ్ఖచెయ్యకుండా లేచి ఒంగి చూసింది గౌరి. ఆమె సన్నగా ఎండుకు పోయినట్లుంది, వయసు చిన్నదైనా, ఒంటి నిండా నగలు తగిలించి ఉన్నాయి, చాలా నగలు. బంగారు నగలు ... కాస్సేపట్లో భజన ఆగిపోయింది. ఆమె పడిపోయింది, ఆడ వాళ్లు వచ్చి ఆమెకు హారతియిచ్చి టెంకాయ కొట్టారు. ఆమెను లేపి కుర్చీలో కూర్చుండబెట్టారు, ఆమె ముఖంలో చెప్పలేనంత తీక్షణత, గాంభీర్యం, తేజస్సు ఒచ్చాయి.... అనంతమైన ఆకాశం క్రింద అంతులేని భూదేవిపైన అందరికంటే ఎత్తుమీద వెలిగి పోతూ మహారాణీలా ఉన్నది అమ్మణ్ణి. అక్కడున్న అందరి చూపులూ ఆశలూ మనసులూ అమెమీద. ఏదో విధంగా కష్టంలో బాధలో యిరుక్కుపోయి భరించలేక విలవిల్లాడుతున్న ఆ నిర్భాగ్యులు ఆమె ప్రజలు. బిడ్డలు.

అమ్మ కూర్చున్నాక గుంపులోనుంచీ, హాహాకారాలు చెలరేగాయి. 'అమ్మా, చిన్నమ్మ తల్లీ, నన్నెందుకు బాధపెడుతున్నావమ్మా. నన్ను విడువు నన్ను కొట్టొద్దమ్మా' అంటూ కొందరు లేచి కేకలు పెడుతూ ఎగరటం ప్రారంభించారు. ఉన్నట్లుండి గౌరి కూడా లేచింది. చేతులు రెండూ సంకెళ్ళు వేసినట్లు ఒకచోట చేర్చి 'అమ్మా, నాచేతులు కట్టేశావు. కొడుతున్నావు. కొట్టొద్దమ్మా. నీకు దణ్ణం పెడతా' అని పిచ్చిగా గంతులు వేస్తున్నది.

చిన్నమ్మ తల్లి నిదానంగా అందర్నీ కలయజూసింది. అది చూపుకాదు, మంత్రం. 'గోల చెయ్యొద్దు, ఊరుకోండి' అని గట్టిగా కసిరింది. కేకలు పెడుతున్నవాళ్లు ఆగి పోయారు. శబ్దం లేకుండా నేలమీద పడి పోయారు గౌరికూడా నేలమీదపడి మట్టిలో దొర్లటం ప్రారంభించింది. ఈ లోకపు ధ్యాస లేదు. చినసుబ్బడు కొండయ్యను గట్టిగా



కరుచుకున్నాడు.

చిన్నమ్మ తల్లి కళ్ళముందు పడితే, ఆమె చూచి, దయతలచి పిలిస్తే వెళ్ళి ప్రశ్న చెప్పించుకుందామనీ, కోరికలు తీర్చేదీ జబ్బులు నయంచేసేదీ అయిన ప్రసాదం పుచ్చుకుందామనీ ఆశతో కొందరు మనుష్యులు ముందుకు తోసుకుపోతున్నారు. గుంపులోనివాళ్ళు యీ అన్యాయం సహించలేక వాళ్ళమీద కేకలు వేస్తున్నారు. ఈ కేకల్ని లెఖ్ఖ చెయ్యకుండా వెళ్ళిపోతున్నారు వాళ్లు.

మరీ ముందరకొచ్చి నిలబడినవాళ్ళలో కొందరిని పలకరిస్తున్నది అమ్మణ్ణి. గుంపులోని వాళ్ళల్లో తన చిత్తానికి వచ్చిన వాళ్ళను ఒక్కొక్కరిని దగ్గరికి పిలిచి మాట్లాడి ప్రసాదం యిస్తున్నది. కొంతసేపటికి దూరాన ఉన్న గౌరిని పిలిచింది. కొండయ్య గౌరిని నడిపించుకొని తీసుకొచ్చాడు.

"ఎవరు నువ్వు?" అన్నది అమ్మణ్ణి.

"కోవూరి కవతల మోపూరులో ఉండే మస్తాన్ బీబీని, సాయిబుల పిల్లని చింత చెట్టుమీద ఉండేదాన్ని. ఈ మనిషి అటు పోతుంటే పట్టుకున్నాను" అన్నది గౌరి. అంతలోనే ఏడుస్తూ "అమ్మా, ఎందుకమ్మా నన్ను బాధపెడుతున్నావు? నాకు చీరా రవికా పెట్టి కోడిమాంసం పెడితే వెళ్ళిపోతాను. నాకు వాతలు పెట్టొద్దు...." అంటూ నేల మీదపడి గిలగిలా తన్నుకోవటం మొదలు పెట్టింది.

"కోడిమాంసం లేదు, ఏమీలేదు. పో" అని ఆజ్ఞాపించింది చిన్నమ్మ తల్లి.

"చీరన్నా యిప్పించు" అని అడిగింది గౌరిలోని మస్తాన్ బీబీ.

"ఏమీ యివ్వం. పొమ్మని చెప్పలేదూ!" గద్దించింది చిన్నమ్మ తల్లి.

"అమ్మా, పోతన్నా. దండం. కొట్టబాక" అన్నది గౌరి. తరువాత కాస్సేపటికి గోల మానేసి మామూలు స్థితికొచ్చింది.

చిన్నమ్మ తల్లి సాదరంగా చూచింది గౌరిని.

"ఇల్లు కట్టుకుందామనుకున్నావ్" అన్నది.

తల వూపింది గౌరి.

"దేనికోసమూ ఆత్రపడకూడదు. ఏదైనా అమ్మయిచ్చినప్పుడే ఒస్తుంది. తెలిసిందా?" అంటూ ఆప్యాయంగా తల నిమిరింది. ప్రసాదం యిచ్చింది.

గౌరి సంతోషంగా ప్రసాదాన్నందుకుని అమ్మణ్ణి పాదాల దగ్గరగా కూర్చుండిపోయింది. మూడు వందలమంది జనం గౌరిని ప్రశంసా పూర్వకంగా చూచారు. ప్రక్కనున్నవాళ్ళు "మీది అదృష్టం. అమ్మవారు వెంటనే పిలిపించింది. కొంతమంది నాలుగు వారాలు ఒచ్చినా పిలవదు." అన్నారు.

గౌరి, కొండయ్య అమ్మవారికి భక్తితో నమస్కరించుకున్నారు. ప్రక్కనే అమ్మవారికి కడుతున్న దేవాలయం పునాదులు చూశారు. అమ్మగారి పటం కొనుక్కొని, అయిదు రూపాయిలు డిబ్బెంలో వేసి తిరిగి వచ్చారు.

మోపూరులో మస్తాన్ అనే సాయిబుల పిల్ల చెరువులో పడి చచ్చిపోయి దయ్యం అయి చింత చెట్టుమీద ఉంటున్న మాట వాస్తమేనని ఎవరో చెప్పారు.

గౌరి రోజూ అమ్మణ్ణి పటానికి దణ్ణం పెట్టుకుంటున్నది. రెండు వారాలకోసారి బస్సులోవెళ్ళి అమ్మ దర్శనం చేసుకుని వస్తున్నది.

ఇప్పుడు ఏ దయ్యమూ గౌరిని పీడించటంలేదు. కాని బస్సుల్లో రానూపోనూ, టెంకాయ కర్పూరం కొననూ, డిబ్బెంలో వెయ్యనూ పాతిక రూపాయిలదాకా ఖర్చుపడుతున్నది కొండయ్యకు. ఎప్పుడైనా పాతిక రూపాయలుపెట్టి ఒక చీర రైకల గుడ్డకొని అమ్మణ్ణికి ఇచ్చుకోవాలని అనుకుంటున్నది గౌరి.

కొండయ్య కొద్దిగా అప్పుల్లో పడ్డాడు. కాని దాన్ని గురించి వాళ్ళు అనుకోరు. అమ్మణ్ణి దయ ముఖ్యం గౌరికి. ఎప్పుడూ అదే ఆలోచన. చిన సుబ్బణ్ణి గురించీ వాడి చదువు గురించీ దిగులుపడదు. ఇల్లు కడితే నేమి? కట్టకపోతే నేమి? ఏది ఎట్లా జరుగుతుందో అంతా చిన్నమ్మ తల్లి దయ.